# హంసలను వేటాడొద్దు [1]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [1]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: మార్చి 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=1954

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [1]

*ఇది 1973లో వచ్చిన రష్యన్ నవల "డోట్ షూట్ ద వైట్ స్వాన్స్"కు తెలుగు అనువాదం. దీని రచయిత బోరిస్ వాసిల్యెవ్. రెండవ ప్రపంచ యుద్ధంలో సైనికునిగా పాల్గొన్నాడు. ఆ అనుభవాలనే ఇతివృత్తాలుగా తీసుకున్నాడు. ప్రస్తుత నవలకు పర్యావరణం ప్రధాన ఇతివృత్తం. రష్యన్ పర్యావరణ సాహిత్యంలో ఈ రచనను మైలురాయిగా భావిస్తారు.*

## రచయిత స్వగతం

*అడవిలోకి అడుగిడినప్పుడు నాకు పోప్లార్ చెట్ల గుసగుసల్లో, కవుకు చెట్ల నిట్టూర్పుల్లో, బండిగురువింద చెట్ల బరువైన అలల కదలికల్లో యెగార్ జీవితం కనపడుతుంది. నేను యెగార్ కోసం కలయచూస్తాను.*

*జూన్ నెల కవుకు అడవిలో అలసట ఎరుగని నిరంతర ఆశావాదిగా అతడు కనపడతాడు. శరత్ రుతువు చిత్తడిలో అతడు పనిలో మునిగిపోయి, చిందరవందరగా కనపడతాడు. గడ్డకట్టిన శిశిరంలో ఆలోచనామగ్నుడై, మెరిసిపోతూ కనపడతాడు. శోభించే వసంతకాల పువ్వుల్లో ప్రశాంత చిత్తుడిగా, సహనంలేనివాడిగా ఏకకాలంలో కనపడతాడు. అతడు తనకు, ప్రజలకు ఎంత వైవిధ్యంగా ఉండేవాడోనని నాకు ఎప్పుడూ ఆశ్చర్యంగొలుపుతూ ఉండేది.*

*తనకోసం, ప్రజలకోసం జీవించిన అతడి జీవితమూ వైవిధ్యంగా ఉండేది.*

*కానీ అన్ని జీవితాలూ వైవిధ్యమైనవేనేమొ? తనకోసం, ప్రజలకోసం వైవిధ్యమైనవేనేమొ?ఈ వైవిధ్యాల మొత్తం కూడిక మాత్రమే ఉందేమొ? వైవిధ్యంగా ఉన్నప్పటికీ, అనిపించినప్పటికీ మనలో మనం ఎప్పటికి ఒకటిగానే ఉంటామేమొ?*

*యెగార్ ఎప్పుడూ తనలాగే ఉండేవాడు కాబట్టి ఒకటిగానే ఉండేవాడు. అతడు అంతకంటే మెరుగ్గాగాని, హీనంగాగాని ఉండేవాడు కాదు, అలా కనపడాలని ప్రయత్నమూ చేసేవాడు కాదు. అతడు తర్కబద్ధంగానో, ఒక లక్ష్యంతోనో ప్రవర్తించేవాడు కాదు, పైవాడి ఆమోదం కోసం ఏదీ చేసేవాడు కాదు; తన అంతరాత్మ ఎలా చెబితే అలా నడుచుకునేవాడు.*

# 1

యెగార్ పొలుష్కిన్ అంటే ఆ కాలనీ అంతటిలో అసమర్ధుడని పేరు. అతడికి ఆ బిరుదు ఎలా వచ్చిందో ఎవరికీ గుర్తు లేదు. విడవకుండా వెంటాడుతున్న దురదృష్టంతో విసిగిపోయిన అతడి భార్య కూడా చికాకు పెట్టే దోమల రొద మాదిరి ఏడుస్తూ ఉండేది: "నా జీవితానికి శాపమైన నా బతుకుకి భారమైన ఎందుకూ పనికిరాని అసమర్థుడైన నీ మీద దేవుడైనా జాలి..."

ఊపిరి తీయగలిగినంతవరకు విరామ చిహ్నం అనేది లేకుండా అలా ఆమె రొద పెట్టేది. యెగార్ విచారంగా నిట్టూర్చేవాడు. తండ్రిని అన్న మాటలకు పదేళ్ల కోల్కా గాయపడి ఇంటి వెనకకు వెళ్లి ఏడ్చేవాడు. తల్లి అంటున్నది నిజమని తెలిసినందుకు కూడా అతడు ఏడ్చేవాడు.

ఈ అరుపులు, తిట్లకి యెగార్ ఎప్పుడూ అపరాధభావనకు గురయ్యేవాడు. తర్కం వల్ల కంటే అతడి అంతరాత్మ వల్ల అతడు అపరాధభావనకి గురయ్యేవాడు. ఈ కారణంవల్ల అతడు ఎప్పుడూ వాదనకి దిగేవాడు కాదు, తనని తాను నిందించుకుని బాధపడేవాడు.

"అందరికీ డబ్బు సంపాదించేవాళ్లు మొగడుగా దొరుకుతారు వాళ్ల ఇళ్లు సంపన్నంగా ఉంటాయి వాళ్ల భార్యలు చిలకల మాదిరి కులుకుతూ ఉంటారు...!"

హారిటీనా పోలుష్కిన్ ఉత్తర రష్యా నుంచి వచ్చింది, శాపనార్థాల నుంచి శోకాలలోకి ఆమె ఇట్టే మారిపోతుంది. పుట్టిననాటినుంచే తన కష్టాలు మొదలయ్యాయని ఆమె భావిస్తుంది, తాగిన మత్తులో ఉన్న మతగురువు పలకటం కష్టం అయిన పేరు ఆమెకి పెట్టాడు, ఇరుగుపొరుగు మహిళలు దానిని రెండు అక్షరాలకు కుదించారు.

"హార్యా మళ్లీ మొదలుపెట్టింది – మొగుడిని సాధిస్తోంది."

పుండుమీద కారం చల్లినట్టు, ఆమె చెల్లి (పీపా మాదిరి ఉంటుంది) మార్యా కాలనీలో నెమలి మాదిరి గర్వంగా పెదాలు బిగించుకుని, కళ్లు తిప్పుకుంటూ తిరుగుతుంది.

"టీనా అదృష్టం బాగాలేక మంచి మొగుడు దొరకలేదు. అది మాత్రం నిజం, చ్చొ...చ్చొ..."

ఆమె ఉన్నప్పుడు టీనా అంటూ పెదాలు బిగించుకుంటుంది. కానీ ఆమె లేనప్పుడు హార్యా అంటుంది, పెదాలు సాగదీసి నవ్వుతుంది. కానీ, వాళ్లు ఈ కాలనీకి రావటానికి కారణం మార్యానే. ఊళ్లో ఇల్లు అమ్ముకుని, ఇక్కడకు వచ్చి అందరి అవహేళనకు గురికావటానికి కారణం మార్యానే.

“అక్కడ నాగరికత ఉంది, టీనా. సినిమాలు వేస్తారు,” అంటూ వాళ్లను ప్రలోభ పెట్టింది.

ఇక్కడ సినిమాలు ఉండటం నిజమే, కానీ హారిటీనా ఎప్పుడూ వెళ్లలేదు. వాళ్ల ఇంటి పరిస్థితి చాలా దయనీయంగా ఉంది, ఆమె భర్తని చూసి అందరూ నవ్వేవాళ్లు, పైగా వేసుకోటానికి మంచి బట్టలు ఎవీ ఆమెకు లేవు. అవే బట్టల్లో రోజూ అందరిముందు తిరుగుతుండటంతో ఆమె కూడా పాతబడిపోయినట్టుగా అయిపోయింది. కానీ మారిట్సాకి (అవును, ఆమెను పొట్టిపేరుతో హార్యా అనేవాళ్లు, కానీ ఆమె చెల్లెలని పూర్తి పేరుతో మారిట్సా అని పిలిచేవాళ్లు!) మొత్తం అయిదు జతల ఉన్ని బట్టలు ఉన్నాయి – మూడు రోజువారీ వాడకానికి, రెండు దాపుడివి. నాగరికతకు అవసరమైన, నలుగురికి ప్రదర్శించగల, ఛాతీ పొంగించుకుని తిరిగే దుస్తులు ఆమెకు ఉన్నాయి.

హారిటీనా దురదృష్టానికి ఏకైక కారణం: ఆమె ప్రియమైన భర్త యెగార్, చర్చిలో పెళ్లిచేసుకోకపోయినా చట్టబద్ధమైన మొగుడు, తన ఏకైక సంతానానికి తండ్రి, ఇంటి సంపాదనాపరుడు; వాడి జిమ్మడ.

ఇంకొక విషయం, ఒక గొప్ప వ్యక్తి అయిన మార్యా భర్త ఫ్యొడార్ ఇపటొవిచ్ బుర్యానోవ్ కి యెగార్ స్నేహితుడు. అతనికి రెండు బజార్ల అవతల అయిదు కిటికీల ఇల్లు ఉంది, మంచి కలప దుంగలతో చిన్న బుడిపె కూడా లేకుండా చేసిన కిటికీలు. జింకుతో చేసిన ఇంటి కప్పు కొత్త పళ్లెంలా తళతళా మెరుస్తోంది. ఇంటి పెరడులో రెండు దుక్కల్లాంటి పందులు, ఆరు గొర్రెలు ఉన్నాయి. జోర్కా అనే ఆవు కూడా ఉంది. అది మంచి పాలచార ఉన్న ఆవు, అది ఉంటే సంవత్సరం పొడవునా పాడికి కొరత ఉండదు. ఇంటికప్పు నడిదూలం మీద నిజమైనదనిపించే కోడిపుంజు ఉంది. ఇంటికి వచ్చిన వాళ్లందరికీ దానిని గొప్పగా చూపించేవాళ్లు:

“స్థానిక కళాకారుడి అద్భుత సృష్టి. దానిని గొడ్డలితో చేశాడు. పాత రోజులలో మాదిరి గొడ్డలి తప్పించి మరో పనిముట్టు ఉపయోగించలేదు, తెలుసా!”

ఈ అద్భుతానికీ ఫ్యొడార్ ఇపాటొవిచ్‌కీ సంబంధం ఏమీలేదు, అది అతడి ఇంటి మీద ఉందంతే. ఆ కోడిపుంజును యెగార్ పొలుష్కిన్ చేశాడు. అప్పుడు కాలక్షేపానికి అతడికి కావలసినంత సమయం ఉంది, కానీ పనికివచ్చే పనిమాత్రం అతడివల్లకాదు. ఇప్పుడు...

హారిటీనా నిట్టూర్చింది. చనిపోయిన తన తల్లి తనని సరిగా గట్టెక్కించలేదు. తన తండ్రి చెర్నాకోలతో తనకు సరిగా బుద్ధిగరపలేదు! అలా చేసి ఉంటే తాను యెగార్‌ని కాకుండా ఫ్యోడార్‌ని కట్టుకుని ఉండేది. అప్పుడు రాణీలాగా దర్జాగా బతికేది.

కనుచూపుమేర అడవులు ఉన్న సమయంలో ఫ్యోడార్ బుర్యానోవ్ అదృష్టాన్ని వెతుక్కుంటూ ఇక్కడకు వచ్చాడు. అప్పుడు కలపకు గిరాకీ ఉండేది. దఢాల్ దఢాల్ మంటూ ఉత్సాహంగా అడవులను నరికారు, బోనస్‌లు పొందారు.

అప్పుడు ఈ కాలనీ కట్టారు, విద్యుత్తు, నీటి సరఫరా తెచ్చుకున్నారు. ఇక్కడికి రైలుమార్గం పడేనాటికి కొట్టడానికి ఒక్క చెట్టు కూడా మిగలలేదు. ఆ దశలో అస్తిత్వం, ఒకరకంగా చెప్పాలంటే ఎవరిదో అంతరాత్మను వెనక విడిచిపెట్టింది. ఒకప్పుడు పచ్చగా విరాజిల్లిన కవుకు అడవి ఇప్పుడు అంతరించిపోతోంది, ఇప్పుడు ఎవరికీ అవసరంలేని ఒక కాలనీ అక్కడ మిగిలిపోయింది. నల్ల చెరువునీ, దాని చుట్టూ మిగిలి ఉన్న అటవీ ప్రాంతాన్ని అతికష్టం మీద జిల్లా సంస్థలూ, అధికారులూ రక్షిత జలాశయంగా ప్రకటించగలిగారు. దాంతో అక్కడి పనులన్నీ ఆగిపోయాయి. అయితే అత్యాధునిక రంపపు మిల్లు ఆ కాలనీలో ఉండటంతో అక్కడికి కలప రవాణా చేసే పనిని చేపట్టారు. కలప రవాణా చేసి, దించుకుని, దానిని కోసి మళ్లీ ఎగుమతి చేసేవాళ్లు. దాంతో నిన్నటి దాకా అడవిని కొట్టినవాళ్లు ఇప్పుడు కలప, చెక్క మోసే హమాలీలుగా, రంపపు మిల్లులో కార్మికులుగా మారారు.

ఈ పరిణామాలన్నింటినీ ఫ్యోడార్ ఇపటొవిచ్ సరిగ్గా ఒక సంవత్సరం ముందుగానే ఊహించి తన భార్యతో చెప్పాడు, "బోనసుల కాలం అయిపోయింది మారిట్సా. త్వరలోనే ఇక్కడ కొట్టడానికి ఏమీ మిగలదు. మంచి రోజులు మిగిలి ఉండగానే నాలుగు కాలాలపాటు ఉండే మరో పని చూసుకోవాలి."

ఆ పనిని అతడు దొరకబుచ్చుకున్నాడు: నల్ల చెరువు చుట్టూ మిగిలి ఉన్న రక్షిత అటవీ ప్రాంతానికి అటవీ అధికారిగా ఉద్యోగం పొందాడు. అప్పటినుంచి అతడికి కావలసినంత పశువుల మేత, పట్టుకున్నన్ని చేపలు, కాణీకి కావలసినన్ని కట్టెపుల్లలు ఇంటికి రాసాగాయి. ఆ సమయంలోనే అతడు తన కొత్త ఇల్లు కట్టుకున్నాడు, ఎన్నో వస్తువులు సమకూర్చుకున్నాడు, పశువులు

కొనుక్కున్నాడు, తన భార్యకు అందమైన బట్టలు కొన్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే అతడికి అతడే యజమాని.

అతని ప్రవర్తన అలాగే ఉండేది: ఒకడిని అడుక్కునేది లేదు, ఒకడిని బతిమాలేది లేదు. అతడికి డబ్బులు, మాటల రెండింటి విలువ బాగా తెలుసు: మంచి కారణం లేకుండా వాటిల్లో ఏ ఒక్కదానిని జారవిడవడు. ఒకడితో ఒక సాయంత్రమంతా ఒక్క మాట కూడా మాట్లాడకుండా నోరుమూసుకుని ఉండగలడు, మరొకడితో చెవి దిబ్బడి వేసేలా సలహాలు ఇవ్వగలడు.

“యెగార్, నీ జీవితాన్ని నువ్వు నిర్దేశించటంలేదు, అది నిన్ను నడిపిస్తోంది. అలా ఎందుకు ఉందంటావ్? ఒక్కసారి ఆలోచించు.”

గొర్రెలా తలూపుతూ యెగార్ విని, నిట్టూర్చేవాడు: తన జీవితం ఎంత దరిద్రంగా, ఎంత హీనంగా ఉంది! తన కుటుంబాన్ని సహనం అంచులకు నెట్టాడు, తాను అవమానాల పాలయ్యాడు, చుట్టుపక్కల వాళ్లముందు పరువు లేనివాడయ్యాడు – ఇవన్నీ నిజమే. ఫ్యొడార్ ఇపటొవిచ్ ఉన్నది ఉన్నట్టు చెప్పాడు. కానీ తను భార్య ముందు, కొడుకు ముందు, మంచివాళ్ల ముందు అతడు అపరాధ భావనకు లోనౌతున్నాడు. అవును, దీనికంతటికీ, ఈ జీవితానికి అంతం పలకాలి. ఒక కొత్త జీవితాన్ని మొదలుపెట్టాలి – అర్థవంతమైన, ప్రకాశవంతమైన జీవితం. దానికి స్వాగతం పలుకుతూ ఫ్యొడార్ ఇపటొవిచ్ దయతో మరొక గ్లాసు మద్యం పోస్తే ఎంత బాగుంటుంది?

“అవును, జీవితాన్ని మలుపు తిప్పాలి, నువ్వు యజమానివిగా ఉండాలి: పెద్దవాళ్లు అదే చెప్పేవాళ్లు.”

“నిజం చెప్పావు, ఫ్యొడార్ ఇపటొవిచ్. నిజాన్ని ఎంత బాగా చెప్పావు!”

“గొడ్డలి ఉపయోగించటంలో నీకు మంచి పనితనం ఉంది, ఆ విషయం నేను ఒప్పుకుంటాను. కానీ – ఏం ప్రయోజనం.”

“అవునవును, నిజమే కదా.”

“నీకు ఎవరైనా దారి చూపాలోయ్, యెగార్.”

“అవునవును, ఫ్యొడార్ ఇపటొవిచ్. ఆ అవసరం నాకు ఎంతైనా ఉంది!”

ఆందోళనతో యెగార్ నిట్టూర్చేవాడు. నిరసనతో ఫ్యోడార్ నిట్టూర్చేవాడు. అక్కడున్నవాళ్లంతా నిట్టూర్చేవాళ్లు - జాలితో కాదు, తిరస్కార భావనతో. వాళ్ల చూపుల కింద యెగార్ తల ఇంకా కిందకి వంగిపోయేది. అతడికిదంతా అవమానకరంగా ఉండేది.

కానీ, ఎవరైనా కాసేపు ఆలోచిస్తే దాంట్లో అవమానపడవలసింది ఏమీలేదని అర్థమవుతుంది. యెగార్ ఎప్పుడూ మనసు పెట్టి పనిచేసేవాడు, తన మానాన తాను బతికేవాడు, చెడు తిరుగుళ్లు ఏమీ లేవు. కానీ, ఎందుకనోగానీ అపరాధభావన అతడిని వెంటాడుతూ ఉండేది. అతడు ఎవరితోనూ వాదనకు దిగేవాడుకాదు. తనని తాను తిట్టుకుంటూ తెగ కుమిలిపోయేవాడు.

తమ సొంత ఊరిలోని ఉమ్మడి వ్యవసాయ క్షేత్రంలో సంపదతో కాకపోయినా, గౌరవంగా బతికేవాళ్లు. ఆ పాత గూటినుంచి అందరూ ఒకేసారి ఎగిరిపోయి వచ్చారు – మతిలేని పక్షిలాగా, ఇల్లువాకిలి, పిల్లాజెల్లా లేని బికారి మాదిరి అతడు ప్రవర్తించాడు. అప్పుడతడిని దెయ్యం ఏదో పూనినట్టు ఉంది.

అది మార్చి నెల, మంచు బాగా కురుస్తోంది, చలి ఎముకలను కొరికేస్తోంది. అతడి అత్తగారు, అంటే హోరిటీనా, మారిట్సాల అమ్మ తన సృష్టికర్తను కలవటానికి వెళ్లింది. అందుకు ఎంతో మంచి సమయం ఎంచుకుంది – పండగ ముందు రోజులు కావటంతో బంధువులందరూ వచ్చారు. మంచులో కార్లు కూరుకుపోతాయి కాబట్టి అందరూ స్లెడ్జ్ బళ్లల్లో వచ్చారు. మారిట్సా కూడా అలాగే వచ్చింది, ఆమె భర్తతో కాకుండా ఒంటరిగా వచ్చింది. అమ్మ చనిపోయినందుకు దుఃఖించారు, అంతిమ సంస్కారాలు చేశారు, చేయవలసిన కార్యక్రమాలన్నీ నిర్వహించారు. విచారపు రోజులు అయిపోయి మారిట్సా నల్ల రుమాలు తీసేసి తన పట్టు శాలువా వేసుకున్న తరువాత మొదలుపెట్టింది, "మీ పల్లెలో సాంస్కృతిక జీవనమే లేదు." "ఏమలాగంటున్నావు?" యెగర్‌కి అర్థం కాలేదు.

"ఇక్కడ ఆధునికమైనది ఏదీ లేదు. అదే మా విషయానికి వస్తే ఫ్యోడార్ కొత్త ఇల్లు కడుతున్నాడు: బజారువైపుకి అయిదు కిటికీలు ఉంటాయి. మాకు విద్యుత్తు ఉంది, అన్ని వస్తువులు దొరికే కిరాణా కొట్టు ఉంది, ప్రతి రోజు సినిమాలు ఉంటాయి."

"ప్రతి రోజూ – కొత్త సినిమానా?" టీనా నోరువెళ్లబెట్టింది.

"చూసిన సినిమానే మళ్లీ చూస్తామా ఏమిటి? మాకు ఫ్యాషన్ వస్త్రాల దుకాణం ఉంది, దిగుమతి చేసుకున్న స్టీలు సామగ్రి అమ్మే కొట్టు ఉంది..."

చీకటి మూలలనుంచి పాత దృశ్యాలు తీక్షణంగా చూస్తున్నాయి. మేరీ మాత బొమ్మ ఇప్పుడు నవ్వటంలేదు, నొసలు చిట్లించి చూస్తోంది – కానీ ఆమెవైపు చూసేవాళ్లు ఎవరున్నారు? అందరూ ముందుకే చూస్తున్నారు, ముందున్న దానికోసం చూస్తున్నారు. దానిని... దానిని ఏమంటారు... ఆధునికత!

"అవును, ఫ్యొడార్ కొత్త ఇల్లు కడుతున్నాడు – బొమ్మరిల్లు మాదిరి ముద్దుగా ఉంటుంది. పాత ఇల్లు ఖాళీ అవుతుంది – దానిని మేము ఏం చేసుకుంటాం? దానిని అమ్ముకోవటం ఎంత చిన్నతనంగా ఉంటుంది: నా కొడుకు వోవా దోగాడిన ఇల్లు అది. అందుకే ఫ్యొడార్ దానిని మీకు ఇమ్మన్నాడు. అయితే, ముందుగా మీరు మా కొత్త ఇల్లు కట్టుకోవటంలో సహాయం చేయాలి. ఎంతైనా నువ్వు మంచి నైపుణ్యంగల వడ్రంగివి, యెగార్."

కొత్త ఇల్లు కట్టుకోవటంలో వాళ్లు సహాయం చేశారు. రెండు నెలలపాటు ఉదయం నుంచి సాయంత్రం దాకా యెగార్ విశ్రాంతి తీసుకోకుండా పనిచేశాడు. ఇది ఉత్తర ప్రాంతం కావటంతో పగటి పొద్దు ఎక్కువ. చీకటిపడేదాకా పనిచేయాలంటే ఎవరైనా సొమ్మసిల్లిపోతారు. అది చాలదన్నట్టు ఫ్యొడార్ ఇపటొవిచ్ వచ్చి, "ఆ మూలన దిగగొట్టడం మరిచిపోవద్దు, మిత్రమా. పనిని మందగించనివ్వొద్దు, బద్దకం చూపవొద్దు: నీకు ఉచితంగా ఇల్లు ఇస్తున్నాను, కుక్కల దొడ్డి కాదు," అనేవాడు.

ఇల్లు ఇచ్చిన మాట నిజమే. కానీ, అంతకంటేముందు చెదలు తినగా మిగిలినవన్నీ ఫ్యొడార్ తీసుకెళ్లాడు. చివరికి గచ్చుబండలు కూడా తీసుకెళ్లాడు. బావి మీదకు ఉన్న కప్పును తీసేశాడు. నేలమాళిగలోని దుంగలు తీయటం మొదలుపెట్టాడు. ఆ తరువాత పశువుల కొట్టంమీద కూడా పడేవాడే. కానీ హారిటీనా నిగ్రహించుకోలేకపోయింది: "తప్పించుకుని జారిపోయే పాము, దాహం తీరని జలగ, నీ జిమ్మడ!"

"అయ్యో, అయ్యో హారిటీనా, ఉద్రేకపడకు. ఎంత కాదన్నా మనమంతా ఒక కుటుంబం. దీనికంత అల్లరెందుకు? నువ్వు ఏమీ బాధపడటం లేదుకదా, యెగార్? నేను న్యాయంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నాను."

“ఆఁ, అబ్బే, అలాంటిదేం లేదు... అంతా ఇలానే ఉంటుందనకుంటాను...”

“అలా అయితే సరే, కొట్టం వాడుకో. దానిని నీకు బహుమతిగా ఇస్తున్నాను,” అంటూ ఫ్యొడార్ వెళ్లిపోయాడు. అతడు అన్నీ లెక్క ప్రకారం చేస్తాడు. అడుగులు కూడా లెక్కపెట్టి వేస్తున్నట్టు ఉంటుంది.

అంతా సర్దుకుపోయింది. ఒకరిళ్లకు ఒకరు వస్తూ, పోతున్నారు. ఫ్యొడార్ చెప్పే విషయాలు వింటూ యెగార్ పిరికిగా, నంగి నంగిగా కూర్చునేవాడు.

“ప్రపంచం మగవాళ్ల మీద ఆధారపడి ఉంది, యెగార్. దానిని మన మగవాళ్లు పట్టి ఉంచుతున్నారు.”

“అవును, ఫ్యొడార్ ఇపాటొవిచ్, చక్కగా చెప్పావు.”

“కానీ, నీలో నిజమైన మగతనం ఉందంటావా? చెప్పు, ఉందంటావా?”

“ఆఁ, అలా అంటే... నాకో ఆడది ఉందిగా...”

“నేను దాని గురించి మాట్లాడటంలేదోయ్, పడక సంగతులు కాదు! నీకు ఎప్పుడూ అదే రంధా!”

అక్కడున్నవాళ్లంతా పగలబడి నవ్వారు. మిగిలినవాళ్లతోపాటు యెగార్ కూడా గొంతు కలిపాడు: ఏమీలేని దానిగురించి కాసేపు నవ్వుకుంటే ఏమిపోయింది? ఫ్యొడార్ ఇపటొవిచ్‌ని చూసి ఎవరూ నవ్వరు, కానీ యెగర్‌ని చూసి మిత్రులారా, నవ్వుకోండి. హృదయపూర్వకంగా నవ్వుకోండి!

టీనా మాత్రం చిరునవ్వు నవ్వి ఊరుకుంది. తన ప్రియమైన అతిథులను చూసి, ఆప్తురాలైన చెల్లెలిని చూసి, ఫ్యొడార్ ఇపటొవిచ్‌ని చూసి చిరునవ్వు నవ్వింది. ప్రత్యేకించి ఫ్యొడార్ – అతడికి యజమాని అతడే.

“అవును, నీకు ఎవరైనా దారి చూపాలి, యెగార్, దారి చూపాలి. ఎటువంటి ఆదేశాలు లేకుండా నువ్వు ఏమీ చెయ్యలేవు. నీ అంతట నువ్వు జీవితాన్ని ఎప్పటికీ అర్థం చేసుకోలేవు. జీవితాన్ని అర్థం చేసుకోలేకపోతే, బతకటం ఎలాగో అర్థం చేసుకోలేవు. ప్రపంచం అలా ఉంది, యెగార్ పొలుష్కిన్. అదృష్టమన్నది ఎరుగని అసమర్థుడివి. ప్రపంచం అలా ఉంది...”

“అవును, ప్రపంచం అలాగే ఉందనుకుంటా...”

*(తరువాయి భాగం వచ్చేవారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige.com